సాక్షి జగిత్యాల

బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



ఎములాడలో సప్తస్వర ఝరి

రాజన్న సన్నిధిలో జరుగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వర్ణలత బృందం సంగీత కచేరి సభికులను ఆకట్టుకుంది.



అంజన్న సేవలో భక్తజనం

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వేలాదిగా తరలివచ్చారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 31.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండవేడిమి పెరుగుతుంది. రాత్రి సమయంలో చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

అవినీతి అధికారుల సమాచారం ఇవ్వండి



ఏసీబీ అధికారులు విడుదల చేసిన పోస్టర్

జగిత్యాలరూరల్: అవినీతి అధికారుల సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ వీవీ.రమణమూర్తి ప్రజలకు సూచించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావచ్చని, చెప్పిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లంచం అడుగుతూ.. పనిచేయని అధికారులను తమకు తెలపాలని, వారిని ట్రాప్ చేసి కేసులు నమోదు చేస్తామని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఎక్కడ అవినీతి జరిగినా తనను సంప్రదించాలని కోరారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. సమాచారాన్ని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తిని 91543 88954, ఇన్‌స్పెక్టర్ రామును 91543 88956, ఇన్‌స్పెక్టర్ తిరుపతిని 91543 88955, ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను 91543 88957 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



సాతారంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

మల్లాపూర్: అనుమతి లేని ఎరువులను రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీ రమేశ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు సాతారం, రాఘవపేట, సిరిపూర్‌లోని ఎరువు ల దుకాణాలను వ్యవసాయ సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు ఈ–పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని సూచించారు. ఏవో లావణ్య, ఏఈవో గజానంద్ ఉన్నారు.

కొడిమ్యాలలో హైమస్ట్ లైట్ల లొల్లి



లైట్లను విప్పుతున్న కాంట్రాక్టర్ వ్యక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలో హైమస్ట్ లైట్ల లొల్లి మంగళవారం మండలవ్యాప్తంగా చర్చనీయంగా మారింది. 2022లో దసరా పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 36 హైమస్ట్ లైట్లను కరీంనగర్‌కు చెందిన శ్రీనాథ్‌రెడ్డి అమర్చారు. మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి హామీ మేరకు వాటిని ఏర్పాటు చేసినా.. ఏడాది గడిచినా కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు ఎలాంటి ప్రొసీడింగ్ ఇవ్వకపోవడం, బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ తన మనుషులతో గ్రామాలకు పంపించి లైట్లను తీసుకెళ్లాడు. ఈ సంఘటన మండలంలో చర్చకుదారి తీసింది.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం, నాగులపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో పంట పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. మిర్చి, వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సీజన్‌లో వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు కార్టప్‌హైడ్రో క్లోరైడ్ మందును ఎకరాకు 400 గ్రాముల చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి చిరుపొట్ట దశలో కనిపిస్తే కొరజిన్ మందును ఎకరాకు 60ఎంఎల్ చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గొన్యనాయక్, బలరాం, రవి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈఓలు నరేష్, సంధ్య. సర్పంచ్‌లు భాస్కర్ రెడ్డి, చెప్పాల నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలకు మోక్షమెప్పుడో..?

- ‘వెల్గటూర్ మండలానికి చెందిన ఓ రైతు తన భూమికి సంబంధించి సర్వే నంబరు మిస్ అయిందని ఏడాది క్రితం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయంలోనూ దరఖాస్తు అందించాడు. సిబ్బంది లేకనో.. ఇతరత్రా కారణాలతో ఇప్పటివరకు దానికి పరిష్కారం మాత్రం చూపలేదు. అప్పటినుంచి ఆ రైతు ఇబ్బంది పడుతూనే ఉన్నాడు.’

- ‘పెగడపల్లి మండలానికి చెందిన ఓ రైతుకు మూడెకరాల భూమి ఉంది. కొంతభూమి వేరే సర్వే నంబరులో పడటంతో సరిచేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటివరకు పరిష్కారం కాలేదు.



ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు: 2,920

కలెక్టరేట్‌కు వచ్చినవి 460(సుమారు)

- దరఖాస్తు చేసుకుంటున్న రైతులు
- పరిష్కారం చూపని అధికారులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు

జగిత్యాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణి పోర్టల్‌లో సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. కొత్తగా అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి కమిటీ వేసినా.. ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. కొన్నేళ్లుగా ధరణి సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పెండింగ్‌లో ఉండటంపై ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం కేవలం రిజిస్ట్రేషన్లు మాత్రమే ధరణి పోర్టల్ పరిమితమైనట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే కమిటీ సైతం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయో.. లేవోనని ఆందోళన చెందుతున్నారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు సంబంధించిన భూములన్నీ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇక్కడే కొన్ని పొరపాట్లు జరిగాయి. కొంతమంది రైతులకు సంబంధించిన భూములు మిస్సింగ్ కాగా.. మరికొన్ని భూములు అసైన్డ్ భూముల్లో, కొన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. కొందరు రైతుల భూముల సర్వేనంబర్లు మరో సర్వేనంబరులో పడటం, క్రమసంఖ్యలో తప్పులు దొర్లడం, మిస్సింగ్ కావడం ఇలా అనేకం ఉన్నాయి. అప్పటినుంచి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూ సమస్యలను మీసేవలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో రైతులు, భూ సమస్య ఉన్న వారు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు. అంతే తప్ప పరిష్కారం మాత్రం కావడం లేదు. భూములకు సంబంధించి మిస్సింగ్ కానీ, అసైన్డ్‌లో చేర్చిన భూములు కానీ తక్కువ విస్తీర్ణం పడిన భూములు ఇలా కొన్ని అవకాశం ఇచ్చారు. కానీ ఇవి మీసేవలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ మండల, ఆర్డీవో, కలెక్టర్ ఆఫీసుల్లోనే పెండింగ్‌లో ఉంటున్నాయి. దరఖాస్తు చేసుకున్నప్పుడు మండల ఆఫీసుకు వెళ్తాయి. అక్కడ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్డీవో కార్యాలయానికి పంపిస్తుంటారు. వీరు పూర్తిస్థాయిలో పరిశీలించి కలెక్టరేట్‌కు పంపిస్తే వారు పరిశీలించి సీసీఎల్‌కు పంపిస్తుండేవారు. తాజాగా ప్రభుత్వం ధరణి పోర్టల్‌పై కమిటీ వేయడంతో అక్కడి నుంచి ఏదైనా ఆదేశాలు వస్తాయన్న ఉద్దేశంతో అధికారులు కూడా ధరణి సమస్యలను ముట్టడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆదేశాలు వస్తే సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

ఆఫీసుల్లోనే..

భూముల సమస్యల కోసం దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులన్నీ మండల, ఆర్డీవో, కలెక్టరేట్ ఆఫీసుల్లోనే ఎక్కువగా పెండింగ్‌లో ఉంటున్నాయి. మండల ఆఫీసుల్లో దరఖాస్తులను పరిశీలించి ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ అక్కడే పెండింగ్‌లో ఉండటంతో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

సిబ్బంది లేక ఇబ్బందే...

గతంలో మండల ఆఫీసులకు దరఖాస్తులు వెళ్లినప్పుడు సంబంధిత వీఆర్వోలు, వీఆర్‌ఏలతో విచారణ చేయించేవారు. ప్రస్తుతం వారిని ఎత్తివేసి వివిధ డిపార్ట్‌మెంట్లకు పంపించడంతో మండల ఆఫీసుల్లో సిబ్బంది కరువయ్యారు. కొన్ని ఆఫీసుల్లో డెప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు ఎక్కువ లేకపోవడంతో గ్రామాలకు వెళ్లి భూ సమస్యలకు సంబంధించి విచారణ చేసే వారే కరువయ్యారు. దీంతో రైతులు దరఖాస్తు చేసుకున్న ఫలితం లేకుండా పోతోంది. ఒకవేళ మండల ఆఫీసుల్లోంచి దరఖాస్తులను పరిశీలించి ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వచ్చినప్పటికీ వారు పరిశీలించి సీసీఎల్‌కు పంపిస్తున్నారు. కానీ అక్కడి నుంచి కూడా సకాలంలో రావడం లేదు.

ప్రజావాణిలో భూ సమస్యల దరఖాస్తులే అధికం

ప్రతి సోమవారం జిల్లా, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి జరుగుతోంది. ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే ప్రజావాణిలో ఇస్తున్నారు. గతంలో మీసేవలో దరఖాస్తు చేసుకున్నామని, పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్లు మిస్సింగ్ అయ్యాయని, తక్కువ విస్తీర్ణం పడిందని, అసైన్డ్ భూముల్లో వచ్చిందని ఇలా ఎన్నో సమస్యలు అధికారులకు విన్నవించుకుంటున్నారు.

అందని రిజిస్ట్రేషన్ ఫీజు

భూముల రిజిస్ట్రేషన్ పారదర్శకంగా చేపట్టాలనే ఉద్దేశంతో త్వరితగతిన రిజిస్ట్రేషన్లు సాగేలా ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. ఇందులో రైతులు మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకుని ఫీజులు చెల్లిస్తున్నారు. కొన్ని అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి. ధరణిలో మిస్సింగ్ నంబర్లు తదితర సమస్యలతో ఆగిపోయినప్పటికీ మళ్లీ తిరిగి రిజిస్ట్రేషన్ ఫీజు రైతులకు రావాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో చాలామందికి రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- మహాత్ముడికి ఘన నివాళి

జగిత్యాల: గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ జాతిని ఏకం చేసేందుకు సత్యం, ధర్మం, అహింసను ఆయుధంగా మలుచుకున్నారని గుర్తు చేశారు. ఎందరో దేశభక్తుల ఐకమత్యంతో స్వాతంత్ర్యాన్ని సాధించారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాస్వామ్య ఫలాలు ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

పది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఇతర వసతులు కల్పించాలని, పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులే..

తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులేనని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు ఆమెను కలిశారు. వయోవృద్ధుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు 14567 ఉందని, ఎవరైనా వేధిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, హన్మంతరెడ్డి, విజయ్, యాకూబ్, అశోక్‌రావు, సతీశ్‌రాజు పాల్గొన్నారు.

భూమికి బదులు భూమిస్తేనే ఒప్పుకుంటాం

- బైపాస్‌పై చర్చలో తేల్చిచెప్పిన రైతులు

మెట్‌పల్లి: బైపాస్ రహదారి నిర్మాణానికి తమ వద్ద ఎంత భూమి తీసుకుంటే మరోచోట అంతమొత్తం భూమి ఇస్తేనే ఒప్పుకుంటామని రైతులు తేల్చిచెప్పారు. బైపాస్‌లో భూములు కోల్పోతున్న మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది రైతులతో మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీఓలు మధు, రాజేశ్వర్ పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఇందులో నేషనల్ హైవే అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వ్యవసాయం చేసుకుని జీవించే తమ కుటుంబాలు విలువైన సాగు భూములను కోల్పోతే రోడ్డున పడుతామని రైతులు తెలిపారు. తమ నుంచి ఎంత భూమిని తీసుకుంటే అంత భూమి ఇస్తే సాగు చేసుకుంటామని వివరించారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం భూమికి బదులు భూమి ఇవ్వదని, ఎంత పరిహారం కావాలో చెబితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒప్పించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. సర్వేకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని కోరారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు తమకు అవకాశమివ్వాలని, ఆ లోపు సమష్టిగా చర్చించి తమ నిర్ణయం చెబుతామని రైతులు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



రైతులతో చర్చిస్తున్న అధికారులు

కొల్వాయిలో నిధుల దుర్వినియోగం

- విచారణ చేపట్టిన డీఎల్‌పీవో

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఏడాది క్రితం అధికారులు విచారణ చేపట్టినా చర్యలు తీసుకోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన తాజాగా విచారణకు వచ్చారు. దుర్వినియోగం వివరాలను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆయన లిఖితపూర్వకంగా ఇచ్చారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిధులు రూ.4లక్షలను సర్పంచ్, కార్యదర్శి, మహిళా సంఘం సభ్యురాలు డ్రా చేశారని, ఇంటిపన్నులు రూ.60వేలు, క్రీడామైదానం వద్ద బోర్డుపెట్టి రూ.65వేలు, పంచాయతీ శిలాఫలకం, చదును చేసే పనులకు రూ.55వేలు, చెత్తసేకరణ ట్రాక్టర్ నడవకున్నా రూ.39 వేలు, బల్బులు, ఇతర ఖర్చుల కింద పెద్ద మొత్తంలో నిధులు డ్రా చేశారని రాసి ఇచ్చారు. అనంతరం సర్పంచ్ మేసు ఏసు మాట్లాడుతూ నిధుల దుర్వినియోగం జరగలేదని, అన్నిటికీ వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. డీఎల్పీవో పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, వార్డు సభ్యులు, ఎంపీవో వెంకటకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

ఆరు గ్యారంటీల అమలుతో పేదల్లో వెలుగు

వెల్గటూర్: ఆరు గ్యారంటీల అమలుతో పేదల్లో వెలుగులు నిండుతాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ముందుగా భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న బాలికలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో మరోరెండు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి, ఎంపీటీసీలు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీని ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్

చెన్న కేశవునికి సంజీవరెడ్డి కూతురు పూజలు



అమరావతిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయికల్: రాయికల్ పట్టణంలోని పురాతనమైన చెన్నకేశవనాథ ఆలయంలో మాజీ రాష్ట్రపతి, ఉమ్మడి రాష్ట్రం మాజీ సీఎం నీలం సంజీవరెడ్డి కూతురు అమరావతి, మనుమరాలు రాధిక మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు సతీష్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చౌదారపు లక్ష్మినారాయణ, చింత శివకుమార్, కడకుంట్ల నరేశ్, సుంకె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి’

జగిత్యాలరూరల్: రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల కోర్టుకు హాజరైన వారు విలేకరులతో మాట్లాడారు. పసుపు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, చెరుకు ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరి 25న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడితే అప్పటి ప్రభుత్వం కక్షపూరితంగా 15 మంది రైతులపై కేసులు బనాయించిందని ఆరోపించారు. వ్యవసాయంపై ఆధారపడే తాము కోర్టుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమపై పెట్టిన కేసులను రద్దు చేయాలని కోరారు. నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, యాగండ్ల మల్లేశం, నేరెళ్ల భూంరెడ్డి, గోలి జనార్దన్‌రెడ్డి, కాటిపల్లి గంగారెడ్డి, బందెల మల్లయ్య, చింతపల్లి గంగారెడ్డి, ముక్కుడ రాంరెడ్డి, అయిల్నేని విక్రమ్‌రెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, బండి వెంకటరాజం, పాల్గొన్నారు.



జగిత్యాల కోర్టు ముందు మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జగిత్యాల: వచ్చేనెల ఒకటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయని ఇంటర్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనరల్ కోర్సులకు 38సెంటర్లు, ఒకేషనల్ సెంటర్లకు 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించామని, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులతో కలిసి తనిఖీలు చేస్తారని వివరించారు.

కేసీఆర్ పాలనలో చెరువులకు జలకళ

జగిత్యాలరూరల్: కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని చెరువులకు జలకళ వచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ఉపాధి నిధులు రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలతో నిర్మించే ప్రహరీకి, రూ.6 లక్షల సీడీపీ నిధులతో సీసీరోడ్డుకు, గంగమ్మతల్లి ఆలయం వద్ద రూ.7లక్షల సీడీపీ, డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించే బతుకమ్మ ఘాట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లక్ష్మీపూర్‌లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. సీడ్ ప్రాసెస్ యూనిట్ పనులు పూర్తయ్యాయని, దానిద్వారా రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. మొన్నటివరకు రాష్ట్రంలోని అన్ని చెరువులు జలకళతో ఉండేవని, నేడు వెలవెలబోతున్నాయని అన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకేనని, అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడటమే బీఆర్‌ఎస్ లక్ష్యమని వెల్లడించారు. ఎస్సారెస్పీ నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లించి జగిత్యాల నియోజకవర్గ చివరి గ్రామాలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, ఉపసర్పంచ్ రఘు, నాయకులు బాలముకుందం, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఈ రాజమల్లయ్య, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

పత్తి రైతు చిత్తు



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రేవెళ్లి స్వామి. గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి. మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. పెట్టుబడి కోసం ఓ వడ్డీ వ్యాపారి నుంచి రూ.50వేలు తీసుకున్నాడు. పంట కాత సమయంలో వర్షం లేక దిగుబడి తగ్గింది. వచ్చిన కొద్దిపాటి పత్తిని దూరప్రాంతానికి తీసుకెళ్లలేక స్వామి పెట్టుబడి ఇచ్చిన వ్యాపారికే తెగనమ్ముకున్నాడు. అది కూడా తక్కువ ధరకే. మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6500వరకు పలుకుతుండగా.. సదరు వ్యాపారి రూ.5800 మాత్రమే పెట్టాడు. పైగా తన బాకీ కింద సగం డబ్బులు తీసుకున్నాడు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు తిరుపతి, లక్ష్మీపూర్ గ్రామం. నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. వచ్చిన దిగుబడిని 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ జిన్నింగ్ మిల్లుకు తరలించాడు. అక్కడ సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. తీరా తేమ, నాణ్యత లేదని కొర్రీలు పెట్టారు. తక్కువ ధర పెడతామని, ఇష్టముంటే ఇవ్వండి.. లేకుంటే తీసుకెళ్లండి అని చెప్పారు. చేసేదిలేక వారు నిర్ణయించిన రేటుకే అప్పగించాడు. రెండోసారి వచ్చిన పంటను గ్రామాల్లోకి వచ్చే దళారులకు విక్రయించాడు.

- అందుబాటులో లేని కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకే కొంటున్న వ్యాపారులు
- పెట్టుబడి ఇచ్చి.. పంట కొనుగోలు
- మోసపోతున్న రైతులు.. పట్టని అధికారులు

గొల్లపల్లి: జిల్లాలో పత్తి దళారుల దందా మూడుపువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని గద్దల్లా తన్నుకుపోతున్నారు. కొనుగోలుకేంద్రాలు అందుబాటులో లేకపోవడం.. ఈ ఏడాది పత్తికి పెద్దగా ధర లేకపోవడంతో దళారులదే రాజ్యం నడుస్తోంది. గ్రామాల్లోకి చేరి.. రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అదే పత్తిని తిరిగి దూర ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా అటు రైతులు నష్టపోవడంతోపాటు అటు మార్కెటింగ్ శాఖ ఆదాయనికి గండి పడుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.600 నుంచి రూ.900 వరకు తక్కువకు కొంటున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు మార్కెట్ యార్డుల్లో కాకుండా జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటుచేయడం.. తీరా పత్తిని అంతదూరం తీసుకెళ్తే అక్కడ నాణ్యత పేరుతో కొర్రీలు పెట్టడం రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో రవాణాభారమని భావిస్తున్న రైతులు గ్రామాల్లోకి వచ్చే దళారులకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో ఒక్కటే సీసీఐ కేంద్రం..

జిల్లాలో వెల్గటూర్ మండలం కొత్తపేట జిన్నింగ్ మిల్లులోనే సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. సదరు మిల్లు కొర్రీలు పెడితే పెద్దపల్లి లేకుంటే చొప్పదండి, కరీంనగర్ తరలించాల్సి వస్తోంది. ఈ మూడు ప్రాంతాలు ధర్మపురి, గొల్లపల్లి, వెల్గటూర్, పెగడపల్లికి దూరంగా ఉంటాయి. అంతదూరం వెళ్లలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఇళ్లు,చేన్ల వద్దకే వ్యాపారులు..

నవంబర్, డిసెంబర్ నుంచే పత్తి ఏరుతారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ.7,020గా ప్రకటించింది. కానీ.. జిన్నింగ్ మిల్లుల్లో రూ.6500కు మించడం లేదు. ఇక గ్రామాల్లోనైతే దళారులు రూ.6,100 నుంచి రూ.6,300 చొప్పున కొంటున్నారు. ఇక్కడ కొన్న పత్తిని కొందరు వ్యాపారులు రైతుల పట్టా పాస్‌పుస్తకం, ధ్రువీకరణపత్రాలతో తిరిగి సీసీఐకి విక్రయిచి క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1200 వరకు ఆర్జిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్నవారు 20 శాతం ఉండగా.. 80 శాతం మంది దళారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఇష్టారీతిన ధరతో కొంటున్నారు. మార్కెట్ ఫీజు చెల్లించకుండానే రాత్రికిరాత్రే డీసీఎం, ఇతరత్రా వాహనాల్లో పత్తి తరలిస్తున్నారు.



గొల్లపల్లిలో డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేస్తున్న ఓ వ్యాపారి

దృష్టికి రాలేదు

రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేక అక్కడక్కడ చిన్నమొత్తంలో అమ్ముకుంటున్నట్లు తెలిసింది. కొంతమంది చిన్న వ్యాపారులు ఐదు పది కిలోల చొప్పున మాత్రమే కొంటున్నారు. పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అలా కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

క్లుప్తంగా

కరీంనగర్ జిల్లాస్థాయి రగ్బీ పోటీలు



శంకరపట్నం(మానకొండూర్): తాడికల్‌లో రగ్బీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు టి.చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ –14 బాలబాలికల పోటీలను మంగళవారం నిర్వహించారు. వీణవంక, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, శంకరపట్నం మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైనవారు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నామాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి సస్పెన్షన్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, జీపీ కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో మహేందర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బోరుబావులతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో బిగించిన హైమాస్ట్ లైట్లకు గ్రామ పంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి, దుర్వినియోగం చేశారని గ్రామానికే చెందిన ముదిగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల విచారణ జరిపి, కలెక్టర్‌కు నివేదిక అందించడంతో ఆ ముగ్గురిపై తాత్కాలికంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

'అర్చక' క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడి నియామకం



మాధవాచార్యులు


కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన అర్చకుడు ఓరుగంటి మాధవాచార్యులు ధూపదీప నైవేద్య అర్చక సంఘం క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవాచార్యులు ప్రస్తుతం సంఘం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

దుస్తుల షాపులో అగ్ని ప్రమాదం

కరీంనగర్‌క్రైం: నగరంలోని బస్టాండు సమీపంలో ఉన్న ఓ దుస్తుల దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ అధికారుల వివరాల ప్రకారం.. బస్టాండు సమీపంలోని రాజేశ్ గ్యాస్ చందాకు చెందిన జ్యోతి డ్రెస్సెస్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి, ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని స్టేషన్ ఫైర్ అధికారి పరమేశ్వర్ వెల్లడించారు.

గోదావరిలో ప్రాణగుండాలు

- ఎగువ ప్రాంతాల్లో 5 గుండాలు
- సత్యవతి, బ్రహ్మ అతి ప్రమాదకరం
- పుణ్యస్నానాలకు వెళ్లి గతంలో ఎంతోమంది మృతి
- ధర్మపురి వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం
- ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని వైనం



ప్రమాదకర గుండాల వద్ద స్నానం చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి గోదావరి వద్ద నీటిమట్టం తగ్గుతోంది. పుణ్యస్నానం కోసం వెళ్తున్నవారు జర భద్రం. ఎందుకంటే పై ప్రాంతాల్లో ప్రమాదకర గుండాలున్నాయి. లోతు తెలుసుకోకుండా వెళ్లిన ఎంతోమందిని అవి మింగేశాయి. వారి కుటుంబాలకు కడుపుకోత మిగిలింది. ఏటా వేసవి సమీపిస్తే చాలు గోదావరి నీటిమట్టం తగ్గుతుంది. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం.

దక్షిణ కాశీగా పేరు..

జగిత్యాల జిల్లాలోని ధర్మపురిని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. ఇది ఒక ప్రాచీన పుణ్యక్షేత్రం. ఇక్కడ లక్ష్మీనృసింహస్వామితోపాటు పవిత్ర గోదావరి ఉంది. నది దక్షిణ ముఖంగా ప్రవహించడంతో దక్షిణ కాశీగా పేరొచ్చింది. ఇందులో స్నానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే, ఈ క్షేత్రానికి నిత్యం మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ముందుగా గోదావరిలో స్నానం చేసి, స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ.

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్..

ధర్మపురి గోదావరిలో సత్యవతి, బ్రహ్మ, యమ, పాల, చక్ర గుండాలున్నాయి. వీటిలో అతి ప్రమాదకరమైనవి సత్యవతి, బ్రహ్మగుండాలు. ఇవి అతి లోతైన ప్రదేశాలు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో ఏడాదిలో 8 నెలలపాటు గోదావరి నిండుకుండను తలపిస్తూ పుష్కరఘాట్లను ఆనుకొని పారుతుంది. దీంతో భక్తులు ఎగువ ప్రాంతాలకు వెళ్లలేక పుష్కరఘాట్ల వద్దే పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. దీంతో భక్తులు తమ కుటుంసభ్యులతో కలిసి స్నానాల కోసం ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ గతంలో ఈత కొట్టేందుకు వెళ్లిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన చాలామంది నీటమునిగి చనిపోయారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటలున్నాయి. అందుకే భక్తులు జాగ్రత్తలు పాటించాలి.

బోర్డులు, జాలీలు ఏర్పాటు చేయాలి

ప్రమాదకర గుండాలున్నాయని దేవస్థానం వారు గోదావరి ఒడ్డున సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించని భక్తులు స్నానం చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా గుండాల వద్ద సూచిక బోర్డులు, జాలీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా భక్తులు స్నానాలు చేసే చోట నిఘా కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాకు లోతు తెల్వదు



మాది పెగడపెల్లి మండలం దోమలకుంట. ప్రతీ సంవత్సరం గోదావరి స్నానానికి వస్తున్నం. మాకు ఇక్కడ లోతు ఎంతుంటదో తెల్వదు. బోర్డులు పెడితే బాగుంటది.

– లక్ష్మి, భక్తురాలు

లోపలికి పోతున్నరు



మాది మల్యాల మండలం. గోదావరి గుండాల కాడ స్నానం కోసం చాలామంది లోపలికి పోతున్నరు. ప్రమాదం జరగకముందే లోపలికి వెళ్లకుండా జాలీలు పెట్టాలి.

– విజయ, భక్తురాలు

ధీర వనిత కామ్రేడ్ కూర మల్లమ్మ

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



నివాళి అర్పిస్తున్న విమలక్క, ఉద్యమకారులు

వేములవాడ: నిత్య నిర్బంధాల మధ్య దాదాపు నిండు నూరేళ్లు జీవించిన కామ్రేడ్ కూర మల్లమ్మ పోరాటవీరులకు జన్మనిచ్చిన మహాతల్లి అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క కొనియాడారు. వేములవాడ పట్టణంలోని మల్లమ్మ ఇంట్లో మంగళవారం ఆమె 5వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మల్లమ్మ ఠాణాల చుట్టూ తిరిగినా ఏనాడూ తన పిల్లలకు లొంగిపోవాలని చెప్పని ధీర వనిత అన్నారు. చిన్న కొడుకు జైల్లో, పెద్ద కొడుకు అజ్ఞాతంలో ఉండగా భర్త బాలయ్య మరణిస్తే ఆయన చితికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. మల్లమ్మ యాదిలో అమర్ రాసిన పాటను పాడి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, రేవతి, పురుషోత్తంరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పోతుల రమేష్, రాకేశ్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

తాహెర్‌కొండాపూర్‌లో శిక్షణ బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌లో మంగళవారం 5 జిల్లాల శిక్షణ అధికారుల బృందం పర్యటించింది. పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం, ఆరోగ్యం తదితర అంశాలపై కరీంనగర్‌లో రెండు రోజుల శిక్షణకు హాజరైన కొమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు యూనిసెఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కిషన్‌స్వామి ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల వినియో గం, మురికి కాల్వల నిర్వహణ, తడి, పొడి చెత్త తరలింపు, కంపోస్టు షెడ్డు నిర్వహిస్తున్న తీరు, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీలో మొక్కల పెంపకం, వైకుంఠధామం తదితరాలపై స్థానికులతో మాట్లాడారు. స్వచ్ఛత, పరిశుభ్రతలో తాహెర్‌కొండాపూర్ జిల్లాలోని మిగిలిన గ్రామాల కంటే ముందంజలో ఉందని తెలిపారు. అనంతరం చెర్లభూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకుమార్, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచు మడికంటి మమత, ఎస్‌బీఎం సభ్యులు రమేశ్, వేణు, ఫణి, హరిణి, సురేశ్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో ఆఫీస్‌కు వెళ్తూ.. కిందపడి

- యువకుడి మృతి
- పెళ్లయిన ఏడాదికే అనంతలోకాలకు..



సంతోష్ మృతదేహం

ధర్మపురి: ఆఫీస్‌కు వెళ్లేందుకు ఇంటినుంచి బయలుదేరిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మ్యాన శంకర్–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకు సంతోష్(27) వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఆటోలో ఆఫీస్‌కు వెళ్తుండగా బూరుగుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్లి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

ఇటీవలే ఘనంగా పెళ్లిరోజు..

సంతోష్‌కు గతేడాది వెల్గటూర్ మండలంలోని కొత్తపేటకు చెందిన సుమలతతో వివాహం జరిగింది. ఇటీవలే పెళ్లిరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెళ్లయిన ఏడాదికే అతను మృతి చెందడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆటోడ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడపడం వల్లే సంతోష్ కిందపడ్డాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం



తిరుపతి మృతదేహం

జగిత్యాల క్రైం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన తిరుపతి(37), అతని మిత్రుడు శివరాత్రి తిరుపతి సోమవారం బైక్‌పై జగిత్యాల వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ తిప్పన్నపేట శివారులో వాహనం ఆపగా, శివరాత్రి తిరుపతి మూత్ర విసర్జనకు వెళ్లాడు. గొల్లెన తిరుపతి బైక్‌పై ఉండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి(వేములవాడ): బావిలో పడి ఓ గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన రుద్రంగి మండలంలోని మానాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్‌కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య(24) తన గొర్రెలను మేత కోసం మానాలకు తీసుకువచ్చాడు. మంగళవారం జీవాలను మేపుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చాక మృతదేహాన్ని వెలికితీయించి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చోరీలు చేస్తున్న యువకుల అరెస్టు

- 11 విద్యుత్ మోటార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీ స్వాధీనం



ట్రాలీ, మోటార్లను చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: జల్సాలకు అలవాటు పడి, చోరీలు చేస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన గుగ్లావత్ నరేశ్, జరుపుల ప్రకాశ్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. గత నవంబర్ 10న గ్రామ శివారులో విద్యుత్ మోటార్లు చోరీ చేయడానికి వెళ్తుండగా ఓ ట్రాక్టర్ ట్రాలీ కనిపించడంతో తీసుకెళ్లి, పొదల్లో దాచిపెట్టారు. గడిచిన మూడు నెలల్లో ఆత్మకూర్‌తోపాటు జగ్గాసాగర్, రాఘవపేట, వెల్లుల్ల తదితర గ్రామాల్లో 11 విద్యుత్ మోటార్లను దొంగలించారు. వాటిని నిజామాబాద్‌లో విక్రయించడానికి మంగళవారం ట్రాలీలో తీసుకెళ్తుండగా జగ్గాసాగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మోటార్లను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లొచ్చి.. తనువు చాలించి

- అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య
- ధర్మారంలో విషాదం



అంకూస్ మృతదేహం

జగిత్యాల క్రైం: ఊళ్లో పని లేదు.. ఉపాధి కోసం అప్పు చేసి, దేశాలు తిరిగాడు.. ఎక్కడా పని దొరకలేదు.. చివరికి స్వగ్రామం చేరాడు.. పనిలేక.. అప్పులు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు జగి త్యాల రూరల్ మండలం ధర్మారానికి చెందిన నేరెళ్ల అంకూస్(44). ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. అంకూస్ జీవనోపాధి కోసం అప్పు చేసి, దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో సౌదీ వెళ్లాడు. అక్కడి కంపెనీ జీతాలు ఇవ్వకపోవడంతో తిరిగి వచ్చాడు. మళ్లీ అప్పు చేసి, ఇరాక్ వెళ్లాడు. అక్కడా పని లేకపోవడంతో స్వగ్రామం చేరాడు. తనకు పని లేదని, అప్పులు ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం లక్ష్మీపూర్ శివారులో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

లైంగిక దాడికి యత్నించిన కేసులో వ్యక్తికి జైలు

కరీంనగర్ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన దంపతులు చొప్పదండిలో నివసిస్తూ కూలీ పని చేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు సంతానం. 2020 జూలై 15న ఉద యం తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటివద్ద ఉన్నారు. వీరి ఇంటి పక్కన ఉండే తాళ్లపల్లి శంకరయ్య మధ్యాహ్నం తొమ్మిదేళ్ల బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తమ్ముడు అరవడంతో శంకరయ్య పారిపోయాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చొప్పదండి అప్పటి ఎస్సై వంశీకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కోర్టులో ప్రవేశపెట్టి, వాదనలు వినిపించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి, శంకరయ్యకు శిక్ష విధించారు.

గోపరపల్లి, పెగడపల్లి గ్రామాల్లో విషాదం

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓదెల మండలంలోని గోపరపల్లిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గ్రామంతోపాటు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లిలో విషాదం నింపింది. పెగడపల్లికి చెందిన మహేశ్, గోపరపల్లెకు చెందిన వంశీకృష్ణారెడ్డిల మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇదే ప్రమాదంలో గాయపడిన సుల్తానాబాద్ పట్టణంలోని సుగ్లాంపల్లి చెందిన పసెడ్ల సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అతని తండ్రి సంపత్ తెలిపారు. వైద్యులు మంగళవారం ఒక శస్త్రచికిత్స చేశారని, మరో రెండు ఆపరేషన్లు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కాగా, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహేశ్, వంశీకృష్ణారెడ్డిల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. మృతుల కుటుంబసభ్యులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఓదార్చారు.

ధర్మనిధి సాహిత్య పురస్కారం అందజేత



అవార్డు అందుకుంటున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్‌కు చెందిన కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పరిషత్తు ప్రాంగణంలో గల దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్యల చేతులమీదుగా అవార్డు, రూ.5 వేలు, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): జేఈఈ మెయిన్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్, శ్రీ చైతన్య కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్యలో మంగళవారం ఉదయం 147 మంది విద్యార్థులకు గాను 142 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఇక్కడ పరీక్ష నిర్వహించలేదు. అయాన్ సెంటర్‌లో ఉదయం 680 మందికి గానూ 673 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 634 మందికి గానూ 620 మంది వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్



పేలిన బాయిలర్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని గోపికృష్ణ ఇండస్ట్రీస్‌లో బాయిలర్ పేలింది. స్థానికుల వివరాల ప్రకారం.. రైస్‌మిల్లులో ధాన్యం ఉడకబెట్టే బాయిలర్ మంగళవారం ప్రమాదవశాత్తు పేలింది. ఆ సమయంలో అక్కడ మిల్లు కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. కాగా, ఈ ప్రమాదంలో గోదాం, ఊక రూం కూలిపోయాయని, సుమారు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని సాగర్‌రావు తెలిపారు. విషయం తెలుసుకున్న రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు తిరుపతిరెడ్డి, నగునూరి అశోక్, పురుషోత్తంరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



స్వామివారి చిత్రపటం తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ: వేములాడ రాజన్న సన్నిధిలో 5 రోజులపాటు జరిగే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని పురవీధుల గుండా సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థినుల కోలాట విన్యాసాలు ఆకట్టుకున్నారు. ఉపన్యాసకుడు పాలెపు చంద్రశేఖర్ శర్మ త్యాగరాజస్వామి జీవిత విశేషాలు, జోత్స్న బృందంచే పంచరత్న గానం, స్వర్ణలత హరికథ, పద్మలత బృందంచే సంగీత కచేరి, గుమ్మడి జనార్దన్, వాణిలచే సితార సోలో కచేరి, ఉమాదేవి సంగీత కచేరి, మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, రేఖ బృందం నృత్య ప్రదర్శన, దుర్గాభవాని నాట్య మండలి వారిచే నాటక కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు శంకర్, కళాకారులు పాల్గొన్నారు.



శిశుమందిర్ విద్యార్థినుల కోలాట ప్రదర్శన



హరికథ చెబుతున్న స్వర్ణలత

అంజన్న సేవలో భక్తజనం



ఆలయం ఎదుట భక్తుల సందడి

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో స్నానాలు చేసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తాగునీరు, పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది పడ్డారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బేతాళస్వామి ఆలయంలో పూజలు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

కేవలం 2500/– పెట్టుబడితో మొబైల్ App ద్వారా వ్యాపారం (Old/ New) అభివృద్ధి, మార్కెటింగ్ ఆదాయం AP/TS జిల్లాల వారిగా ఫ్రాంచేసిస్ కొరకు. 8106024624. [WA-7281]

REAL ESTATE
HOUSE FOR SALE

House for Sale in Bank Colony, G+1, 4 BHK, Road No.4. Clear title & Perfect Vasthu. Price 1.60 Crs. Negotiable. Cont: 9502346517, 7382849707. [WA-7279]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233768]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824